జగన్నినాదమే ధైర్యం









ప్రజాభిమానం ఉప్పొంగింది.. వర్షంలోనూ రోడ్లపై బారులు తీరి స్వాగతించింది.. స్వచ్ఛందంగా తరలివచ్చి సంఘీభావం తెలిపింది. జై జగన్ నినాదమే తమ స్థైర్యమంటూ చాటి చెప్పింది. కూటమి ప్రభుత్వ అరాచకత్వాన్ని సహించబోమంటూ జననేతతో గొంతుకలిపింది. టీడీపీ మూకల చేతిలో తీవ్రంగా గాయపడి, విజయవాడ సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం అశేష జనసమూహం తరలివచ్చింది.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ వి.భావన్నారాయణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సేవలను అందించటంలో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. నిర్లక్ష్యాన్ని విడి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రేషన్ అక్రమ రవాణా, ఇసుక, మట్టి అక్రమ, అడ్డగోలు రవాణాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిరంతరం ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ వెంకటరమణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ పాఠశాల రజతోత్సవం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల రజతోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం తాయారు తెలిపారు. గ్రామంలోని రాజుల బజారులోని పాఠశాల ఆవరణలో ఈ వేడుకలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరవుతారని తెలిపారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని హెచ్‌ఎం కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



రామవరప్పాడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నిడమానూరు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్ తెలిపారు. పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా మంగళవారం గ్రామంలోని పంట కాలువ, డ్రెయిన్లలో పూడిక తీయించారు. ఈ సందర్భంగా ప్రకాష్ నాథ్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో రైతుల ప్రయోజనార్థం పోరంకి రోడ్డులో పంట కాలువ, గ్రామంలో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను పూడిక తీయిస్తున్నామన్నారు. పల్లపు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సురక్షిత తాగునీరు అందించేందుకు తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు అన్నదానం



పెనమలూరు: రోడ్డు పక్కన జీవించే 200 మంది నిరుపేదలకు అన్నదానం చేశామని యనమలకుదురుకు చెందిన మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకురాలు వీరంకి కీర్తి వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రోడ్డు పక్కన నివసించే 200 మంది అనాథలకు అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశామన్నారు. తమ సంస్థ గత కొన్నేళ్లుగా అనాథులకు అండగా నిలిచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వనజా చంద్రశేఖర్‌కు అభినేత్రి పురస్కారం ప్రదానం



గన్నవరం రూరల్: గన్నవరానికి చెందిన కూచిపూడి నాట్య గురువు వనజా చంద్రశేఖర్‌కు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి అభినేత్రి అవార్డును ప్రదానం చేశారు. కూచిపూడి నాట్యానికి పూర్వ వైభవం సాధించే కృషిలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సంస్థ ఈ అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. హైదరాబాద్ ముచ్చింతల్‌లో ఉన్న చినజీయర్‌స్వామి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ఇచ్చి ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు.

లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో కలశ స్థాపన



కుంకుమార్చనలు నిర్వహిస్తున్న భక్తులు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో మంగళవారం శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. తొలుత కాసరనేని బాబురావు, బేబిసరోజిని దంపతులచే కలశ స్థాపన చేపట్టారు. అనంతరం శ్రీలక్ష్మీ సహస్రనామ పూర్వక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి గ్రామ పొంగళ్లను సమర్పించడంతో పాటు ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కి పూజలు జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రావణ మాసంలో ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు కుంకుమార్చనలను భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ కోరారు. ఈ నెల 9న మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీసత్యసాయి సేవా సమితి, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహిస్తామన్నారు. రెండో శుక్రవారం ప్రభ బండ్ల ఊరేగింపు, అమ్మవారికి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

- జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్
- వేలేరులో రైతులకు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆయిల్‌పామ్ తోటల సాగు ఎంతో లాభదాయకమని, ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి అన్నారు. బాపులపాడు మండలం వేలేరులో ఉద్యాన శాఖ, వ్యసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ), పతాంజలి ఫుడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన రాజా గోపాలకృష్ణ తోటలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమానికి జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా కేంద్రం (పేదవేగి) ముఖ్య శాస్త్రవేత్త ఎం.వి.ప్రసాద్ హాజరై రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఆయిల్‌పామ్ తోటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను, వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు.

విత్తనాల పంపిణీకి ప్రోత్సాహకం..

జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి మాట్లాడుతూ కొత్తగా ఆయిల్‌పామ్ పంట సాగు చేసిన రైతులకు స్వదేశీ విత్తన మొక్కల నిమిత్తం హెక్టారుకు రూ.20 వేలు, విదేశీ విత్తన మొక్కలకు రూ.29 వేలు చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామన్నారు. అంతేకాక తొలి నాలుగేళ్ల హెక్టారుకు రూ.5,250 చొప్పున ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. మండల ఉద్యాన అధికారి ఈ.హరిచంద్, పతాంజలి ఫుడ్స్ డీజీఎం వీరేంద్ర చౌదరి, ఆయిల్‌పామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బా వీరరాఘవరావు, నాయకులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై మాజీ మంత్రి వెలంపల్లి నిరసన



మాజీ మంత్రి వెలంపల్లితో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

గన్నవరం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని కలిసేందుకు విచ్చేసిన పార్టీ నేతల వాహనాలను గన్నవరం విమానాశ్రయం ప్రధాన గేటు వద్దే పోలీసులు అడ్డుకోవడం వివాదస్పదమైంది. పోలీసుల తీరుకు నిరసనగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆందోళనకు దిగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి మంగళవారం సాయంత్రం గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేస్తున్న మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పార్టీ నేతలు తరలివచ్చారు. అయితే ముఖ్య నేతలను మాత్రమే ఎయిర్‌పోర్ట్ లోకి అనుమతించిన పోలీసులు మిగిలిన వారి వాహనాలను మెయిన్ గేట్ వద్దే అడ్డుకున్నారు. అదే సమయంలో ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా వాహనాల్లో కొన్నింటిని పోలీసులు నిలిపివేశారు. ఈ విషయమై పోలీసులను మాజీ మంత్రి వెలంపల్లి అడిగినప్పటికీ సరైనా సమాధానం చెప్పలేదు. దీంతో పోలీసుల తీరు పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ వెలంపల్లి మెయిన్ గేటు వద్ద బైఠాయించారు. చివరికి దిగివచ్చిన పోలీసులు వాహనాలను లోపలికి అనుమతించేందుకు అంగీకరించడంతో వివాదం సర్దుమణిగింది.

బ్యాంకులతో ప్రజలకు ఆర్థిక భద్రత



వణుకూరులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నరేంద్రజయవర్ధన్, ఉద్యోగులు

పెనమలూరు: బ్యాంకులతో ప్రజలకు ఆర్థిక, సామాజిక భద్రత కలుగుతుందని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కృష్ణాజిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ టి.నరేంద్రజయవర్ధన్ అన్నారు. వణుకూరు గ్రామంలో మంగళవారం సౌజన్య సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ సంస్థ ఆధ్వర్యంలో జన సురక్ష పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రజయవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు బ్యాంకులు లక్ష్యంగా పని చేస్తున్నాయన్నారు. అనేక ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుబాటులో ఉంచి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామని తెలిపారు. బ్యాంకుల ద్వారా అమలు జరుగుతన్న పథకాల పై ప్రజలు అవగాహన పొంది కుటుంబాలు అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రతి ఒక్క ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన తప్పక కలిగి ఉండాలన్నారు.

కళా జాత ద్వారా చైతన్యం..

ఇండియన్ బ్యాంకు మేనేజర్ చేతన్ మాట్లాడుతూ.. సైబర్ మోసాల కారణంగా ఖాతాదారులు అధికంగా మోసపోతున్నారన్నారు. మోసపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యత జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజలు బ్యాంకుల సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ చెల్లింపులపై దృష్టిపెట్టాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత కోసం కళా జాత ద్వారా చైతన్యం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కృష్ణంరాజు, టి.హేమారావు, మహిళలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలంటూ సమ్మె నోటీసు



పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

రామవరప్పాడు: రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ మండల కార్యదర్శి పి. వెంకటేశ్వరావుతో కలిసి పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ఘంటా రామ్మోహనరావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నానాటికీ నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్న పంచాయతీ కార్మికులకు చెల్లించే దినసరి వేతనం రూ.350 ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. స్థానికంగా ఉన్న పోటీ కారణంగా తక్కువ ధరకు టెండర్ వేసి కార్మికుల పొట్టపై కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

20 నుంచి సమ్మె

ప్రస్తుతం ఉన్న టెండర్లు రద్దు చేసి ఈనెల 19వ తేదీలోగా వేతనాలు పెంచాలని, లేని పక్షంలో 20న కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేయడానికి కమిటీ తీర్మానించిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వేతనాల కమిటీ నిర్ణయించిన ప్రకారం అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.569, సెమీ స్కిల్డ్ వర్కర్స్‌కు రూ.683, స్కిల్డ్ వర్కర్లకు రూ.797 చొప్పున చెల్లించాలని ఆదేశాలున్నా పాటించకపోవడం దురదృష్టకరమన్నారు. వేతనాల కమిటీ నిర్ణయించిన దానికి తగ్గకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత టెండర్‌ను రద్దు చేసి మరలా కొత్తగా టెండర్లను పంచాయతీ అధికారులు ఆహ్వానించాలని కోరారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ కమిటీ అధ్యక్షుడు సీతారామరాజు, కార్యదర్శి వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



పెనమలూరు: మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారంగా మారుతుందని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని యాంటీ డ్రగ్ నోడల్ ఆఫీసర్, ప్రొఫెసర్ కోనేరు అనురాధ తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్, యాంటీ టొబాకోపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల విజయాలపై మాదక ద్రవ్యాలు తీవ్రమైన ప్రభావం చూపుతాయన్నారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలంటే మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలు వినియోగించే వారు క్రిమినల్ కేసుల్లో ఇరుక్కొని భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. మాదక ద్రవ్యాలు వాడటం వలన సమాజంలో కూడా గుర్తింపు కోల్పోయి కుటుంబాలు దెబ్బతింటాయని చెప్పారు. విద్యార్థులు చదువు, క్రీడల పట్ల ఆసక్తి చూపితే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ రవిచంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం

ఉంగుటూరు: లంకపల్లి అగ్రహారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓంద్రంపాడులో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం చింత వెంకటేశ్వరరావు రేకుల ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారు జామున విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో అతను కేకలు వేయడంతో స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నంచేశారు. గన్నవరం అగ్నిమాపక బృందం అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో మోపెడ్, వ్యవసాయ నిమిత్తం ఉంచిన రూ.50 వేలు నగదు, విలువైన డాక్యుమెంట్లు దగ్ధమయ్యాయి. రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఐక్యత ర్యాలీ



ఐక్యత ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం హెచ్‌సీఎల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశ ఐక్యత ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మోహిని కృష్ణకుమారి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని భరత్ మాతాకి జై అంటూ నినాదిస్తూ ఐక్యత ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ బి.సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యత ర్యాలీ నిర్వహించామన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించవచ్చని తెలిపారు. ర్యాలీలో వ్యాయామోపాధ్యాయులు డి.నాగరాజు, ఎస్కే మీరా సాహెబ్, జనంజనరాజు, గోపి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

పెనమలూరు: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు చేశామని మండల విద్యాశాఖ అధికారి శేషగిరిరావు తెలిపారు. ఆయన వివరాలు తెలుపుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిధిలో మొత్తం 36 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఆరు, ఎంపీయూపీ పాఠశాలలు 4, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు 26 ఉన్నాయని తెలిపారు. మొత్తం 36 పాఠశాలల్లో 5,278 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం స్కూల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నిక నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నిక అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ నూతన కమిటీలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

కంకిపాడులో ఎన్నికలు

కంకిపాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీన యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. యాజమాన్య కమిటీ ఎన్నికలకు సంబంధించి విధి విధానాలను తల్లిదండ్రులకు నోటీసు బోర్డు ద్వారా తెలియజేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



తహసీల్దార్ విమలకుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ శ్రీలత

ఉంగుటూరు: ఉంగుటూరు తహసీల్దార్‌గా జె.విమల కుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జె.వి.సుబ్బారావు ద్వారక తిరుమలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత, రెవెన్యూ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఉయ్యూరు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఉయ్యూరు: ఉయ్యూరు తహసీల్దార్‌గా ఎం.సురేష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కాగిత కొండ, రెడ్డి రమణ, మెరుగుమాల ఏసుబాబు, బాజ్జీ, వీరప్ప, శ్రీదేవి, ప్రసాద్, నాగ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

గన్నవరం రూరల్: రైతులు సాగు చేసే పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్ఎల్ తేజస్వి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో కౌలు చేసే పంటల సాగుదారులు ఆధార్ కార్డు, కౌలు కార్డు తీసుకుని వ్యవసాయ సహాయకులను కలవాలని చెప్పారు. సొంత పొలం సాగు చేసే రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. రైతులందరూ వెంటనే ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు.

'ఏఐ'తో మరింత వేగంగా పనులు

పటమట(విజయవాడపశ్చిమ): నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అకౌంట్స్‌లో మరింత పారదర్శకత లభిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఏ కనకదుర్గ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఏ రోల్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఇన్ అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ ఏ కనకదుర్గ మాట్లాడుతూ అందుబాటులోకి వచ్చిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల విశ్లేషణ, త్వరితగతిన సమాచార మార్పిడి జరగటానికి అవకాశముంటుందన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు అధ్యక్షత వహించారు. విభాగాధిపతి హేమంత్, అధ్యాపకులు కె. ప్రకాష్, జయవర్ధన్ పాల్గొన్నారు.